# ముత్యాల గద్దెలో



వరుసగా వచ్చిన తుఫాను పరంపర తరువాత, నోటిదాకా వచ్చిన పంట నీటిపాలుకాగా మిగిలిన దాన్ని కన్నీళ్ళు తుడుచుకోవడానికి కూడా ఓపిక లేని చేతులతో విడదీసి ఎండబెట్టి బల్లకొట్టుడు కొడుతున్నారు రైతులు. గోదావరి గండితో నీటి సప్లయి సరిలేక, వర్షాలులేక పాడవగా మిగిలిన పంట యీ తుఫానులకు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయి రైతుల గుండెల్లో చిక్కని చీకటి మిగిలింది. అంచేత మరీ ప్రాణంమీదికి వస్తేగాని ప్రజలు హాస్పిటల్‌కి రాకపోవడంతో నర్సింగ్‌హోమ్ చాలా డల్‌గా వుంది. మెడికల్ మేగజైన్ తిరగేస్తూ పేషెంట్స్ కోసం ఎదురుచూస్తూంది డాక్టర్ సుమిత్ర.

భారంగా అడుగులేస్తూ లోపలికి వస్తున్న శాంతను చూచి సుమిత్ర చిరునవ్వుతో ఆహ్వానించింది.

“ఒంట్లో బావుందా శాంతా?” మౌనంగా బావుందన్నట్లు తలూపింది శాంత.

“ఏమిటంత డల్‌గా వున్నావీరోజు?”— చిన్నగా నవ్వి ఊరుకుంది శాంత. బి. పి. చూచి, నీరుడు పరీక్ష చేయించి, పరీక్షచేసే బల్లమీద పడుకోబెట్టింది శాంతను. శాంత మొఖంలో లీలగా ఆందోళన మెదులుతూంది. శాంత మొఖం వంక ఆసక్తిగా చూస్తూంది సుమిత్ర.

“ఎనిమిదోమాసం జరుగుతూందికదూ?” కడుపు పరీక్ష చెయ్యసాగింది సుమిత్ర. ఫీటల్ హార్టుని గమనించి శాంతను లేవమనిచెప్పింది.

“ఆంటీ! నాకు నిజంగా గర్భిణీయేనా?” ఆందోళనగా అడిగింది శాంత.

“అదేం అలా అడుగుతున్నావు?” విస్మయంగా శాంత వంక చూచింది సుమిత్ర.

“ఆ మధ్య ‘వనిత’లో ‘సూడోసయిసిస్’ అనే కథ వచ్చింది చూచారా? ఆ కథ చదివి నప్పటినుండి నాకు ‘నిజం గర్భిణా’ లేక ‘అబద్ధపు గర్భిణా’ అని అనుమానమొస్తుంది ఆంటీ! నాకు చాలా భయంగావుంది” శాంత మాటలు విని ఫక్కున నవ్వింది సుమిత్ర.

“భలేదానివి. లేలే. లేచి చీర కట్టుకో. నీ అనుమానం, భయం చాలా అందంగా వుంది. ఎక్కడో నూటికి, కోటికి ఒకరికలా వస్తుంది. అది పిల్లలు లేక, కావాలని ఆశపడేవాళ్ళకు వస్తుంది. సరే - మీవాడు లోపల నుండి ఒకటే తన్నుతున్నాడని గొడవచేసావు క్రితంసారి వచ్చినప్పుడు. ఇప్పుడు తన్నులు తగలడం లేదేమిటి?” శాంతని హాస్యం చేస్తూ పరీక్ష చేసే గదినుండి బయటికి వచ్చింది సుమిత్ర. చేతులమీద మోసుకొస్తున్న పేషెంట్‌ను చూచి కంగారుగా ఎదురెళ్ళింది. సుమిత్ర ఏమీ అడగనవసరం లేకుండానే రక్తంతో తడిసిపోయిన చీర, పాలిపోయిన పేషెంట్ ముఖం పేషెంట్ పరిస్థితిని తెలిపాయి.

“మళ్ళీ ఎప్పటినుండి అవుతూంది బిడ్డ?” పేషెంట్ పల్స్‌ని గమనించడానికి ప్రయత్నిస్తూంది సుమిత్ర. సుమిత్ర సూచనలననుసరించి రక్తం శాంపిల్స్ తియ్యడానికి చిన్న సీసాలు, సెలైన్ ఎక్కించడానికి ఏర్పాట్లు చేసారు నర్స్, కాంపౌండర్.

సుమిత్ర ప్రశ్న విని పేషెంట్ తల్లి, అత్తగారు తలలు దించుకున్నారు.

“నిన్నటినుండి అవుతూంది డాక్టర్” వాలి పోతున్న కళ్ళను బలవంతాన విప్పి జవాబిచ్చింది వసంత.

బ్లడ్ శాంపిల్స్ యిచ్చి వెంటనే ఒక బాటిల్ రక్తం తీసుకురమ్మని చెప్పి సెలైన్ స్టార్ట్ చేసింది సుమిత్ర.

“వసంతా! భయంలేదమ్మా! ఇంజక్షన్ చేస్తున్నాను. కాసేపు ప్రశాంతంగా పడుకో.” మత్తు యింజక్షన్ చేసింది సుమిత్ర. నెమ్మదిగా వసంత నిద్రలోకి జారేవరకు ఆమె చెయ్యి పుచ్చుకుని నుంచుని, మెల్లగా చేతిని మంచం మీదుంచి, చేతులు కడుక్కుని వస్తూ భయంతో గడ్డకట్టుకుపోయి నిలుచున్న శాంతను చూచింది.

“ఏయ్! ఏమిటలా నిలబడిపోయావు? అలా కూర్చో. మందులు రాసిస్తాను” అంది సుమిత్ర శాంత చెయ్యి పట్టుకుని స్టూల్‌మీద కూర్చో పెడుతూ.

“ఆంటీ! ఆ అమ్మాయికేం జబ్బు?” ఆత్రుతగా అడిగింది శాంత.

“ముత్యాల గర్భిణి వచ్చింది” మందులు వ్రాస్తూ జవాబిచ్చింది సుమిత్ర.

“ముత్యాల గర్భిణా?” శాంత కంఠం విని చటుక్కున తలెత్తింది సుమిత్ర.

డాక్టర్
ఎ. విజయలక్ష్మి

“నీ భయం సంగతి మరిచిపోయి ఏదో పరధ్యానంగా చెప్పాను. సో సారీ! ముత్యాల గర్భిణీ లేదూ, ఏం లేదు. నన్ను కరుణించి మరిచిపో తల్లీ!” సుమిత్ర ప్రాధేయపూర్వకంగా చూచింది.

“ఆంటీ! ముత్యాల గర్భిణి అంటే ఏమిటి? ముత్యాల్లాంటి అందమైన పిల్లలు పుడతారా? అబ్బ! చెప్పండి ఆంటీ!” ఆపుకోలేని కుతూహలంతో డాక్టర్‌ని తొందరచేసింది శాంతి.

“అమ్మా! తల్లీ! నీకో నమస్కారం. ‘సూడోసయిసిస్’ కథ చదివి నిజం గర్భిణా, అబద్ధపు గర్భిణా అని యిప్పటిదాకా ఊపిరాడకుండా ప్రశ్నలు వేసావు. ఇప్పుడు ముత్యాల గర్భిణి గురించి చెప్పానంటే మళ్ళీ నీ కడుపులో వుంది బిడ్డా, లేక ముత్యాలా అని అనుమానం పట్టుకుని భయంతో కరడుగట్టుకు పోతావు. నన్నెందుకు చంపుతావుగాని-యిదిగో ఈ మందులు కొనుక్కుని, వాడు” మందుల చీటీ శాంత ముందు పెట్టింది సుమిత్ర. చీటీవంక కన్నెత్తి చూడను కూడా చూడలేదు శాంత.

“ఆంటీ! నిజంగా ముత్యాలుంటాయా గర్భంలో?” చిన్నపిల్లలా సరదాపడుతూ అడిగింది శాంత.

“అవును. ముత్యాలుంటాయి. నెక్లెస్ చేయించుకోవచ్చు” ఎగతాళిగా చూచింది సుమిత్ర. సుమిత్ర మాటలు విని మూతి ముడిచింది శాంత.

“ఇదిగో మర్యాదగా చీటి తీసుకుని వెళ్తావా లేక బ్యాంకులకి ఫోన్ చెయ్యమంటావా, చెప్పు” ఒకబ్యాంకిలో శాంత నాన్నగారు, ఇంకొక బ్యాంకిలో శాంత భర్త పనిచేస్తున్నారు.

“ఆంటీ! ఇప్పుడు యింటికి వెళ్ళినా నాకు తెలుసుకునేదాకా అన్నం సయించదు, నిద్ర పట్టదు. ఒకచోట నిలవలేను, కూర్చోలేను, పోనీ పడుకుందామా అంటే పడుకోలేను. అంచేత మీరు చెప్పక తప్పదు. మీరు చెప్పేదాకా నేను కదలను” శాంత భీష్మప్రతిజ్ఞ విని ఆ అమ్మాయి కుతూహలాన్ని తీర్చక తప్పలేదు సుమిత్రకు.

“ముత్యాల గర్భిణి అనేది పిండం ఏర్పడడంలో లోపంవల్ల వస్తుంది. పిండ నిర్మాణంలో వచ్చే కొన్ని మార్పులవల్ల శిశువు, మామూలుగా శిశువుతోవుండే ‘మాయ’కు బదులుగా ముత్యాలు, ముత్యాలుగా వుండే పెద్ద ‘మాస్’ అంటే

తెలుగులో ఎలా చెప్పాలో తెలియడం లేదు. 'మాస్' అంటే పదార్థమని అనుకోవచ్చు. అది తయారవుతుంది.''

''మరి శిశువు లేనప్పుడు అది గర్భిణి ఎలా అవుతుంది ఆంటీ?'' శాంత ప్రశ్నలకు వెంట వెంటనే జవాబివ్వడానికి, అదీ తెలుగులో విడమరిచి చెప్పడానికి ఇబ్బంది పడింది సుమిత్ర.


''నిజంగా శిశువు లేకపోయినప్పటికీ శిశువుకు సంబంధించిన కణాలే అలా మార్పుచెంది ముత్యాల్లాగా తయారవుతాయి. అదీగాక ముత్యాల గర్భిణి వచ్చిన స్త్రీకి మామూలుగా గర్భిణీ స్త్రీకి వుండే చిహ్నాలన్నీ వుంటాయి. వేవిళ్ళు మామూలు వాళ్ళకన్నా ఎక్కువగా వుంటాయి. ఎప్పుడూ ఒంట్లో బాగులేనట్లుగా, అలసటగా, నీరసంగా వుంటుంది. సామాన్యంగా మూడు, నాలుగు నెలల్లో అప్పుడప్పుడు 'బట్ట' కనిపిస్తూ వుంటుంది. ఒకొక్కప్పుడు కొంచెం ఎక్కువ కూడా అవుతుంది.''

''డాక్టర్ పరీక్ష చేసినప్పుడు తెలియదా ఆంటీ?''

''చాల వరకు తెలుస్తుంది. పరీక్ష చేసినప్పుడు కడుపు వుండవలసిన దానికంటే పెద్ద సైజులో వుంటుంది. శిశువు అవయవాలకు బదులు అదోలా-నార్మల్‌గా లేనట్లుగా వుంటుంది. ఒకోసారి గుబ్బపు వాతపు లక్షణాలుంటాయి. కడుపుకు ఎక్సరే తీయడం వల్ల నాలుగు నెలల గర్భిణి తరువాతయితే కొంత వరకు తెలుస్తుంది. యిప్పుడు విదేశాల్లో 'సోనార్' అనే పరికరంతో గర్భంలో వున్నది బిడ్డా, లేక ముత్యాలా అనేది నిర్ణయిస్తున్నారు. కాని-బ్లీడింగ్ అవుతున్నప్పుడు ముత్యాల్లాంటివి పడితే యింక నిస్సందేహంగా అది ముత్యాల గర్భిణి అని చెప్పవచ్చు.'' చెప్పడం ఆపి శాంత వంక ''యింక వెళ్ళు'' అన్నట్లుగా చూచింది సుమిత్ర. ''ఆంటీ! ముత్యాల గర్భిణికి ట్రీట్‌మెంట్ ఏమిటి?'' డాక్టర్ చూపుల్ని ఏమాత్రం పట్టించుకోలేదు శాంత. వెళ్ళమంటూందని అభిమాన పడలేదు.

''చాల పెద్ద చిక్కు తెచ్చి పెట్టావే! వుండు. ఆ అమ్మాయి పల్స్ ఎలా వుందో చూసొస్తాను'' పేషెంట్ పల్స్, నాలుక చూచి, సెలైన్ సరిగా వెళ్తొందో లేదో చూచి వచ్చింది సుమిత్ర.

''చెప్పండి ఆంటీ! ట్రీట్‌మెంట్ ఏమిటి?'' సుమిత్రను నిలవనివ్వ లేదు శాంత.



# రబ్బరు బంతితో పేపర్ వెయిట్

తీరిక, వీలు ఉన్నవాళ్ళు ఇంటికి కావలసిన ఎన్నో క్రొత్త కొత్త వస్తువులు చేసి అందంగా అలంకరించుకోవచ్చు. ఈ కాలంలో ప్రతి యింట్లోనూ డ్రాయింగ్‌రూం అంటూ ఒకటి ఉండి తీరుతుంది.

ప్రతి గృహిణికీ మిగతా గదులు ఎలా ఉన్నా కనీసం నలుగురు స్నేహితులు, బంధువులు వచ్చి కూచుని పోయే యీ డ్రాయింగ్‌రూంని, అందంగా ఉంచుకోవాలనే ఉంటుంది. అందు కోసమని ఎంతో శ్రమ తీసుకుంటుంది. నాలుగు కుర్చీలు, మధ్యలో టీపాయ్; టీపాయ్ మీద పత్రికలు – ఆ పత్రికలు ఎగిరిపోకుండా పేపర్ వెయిట్స్ ఉంచుతారు. వేసిన నాలుగు కుర్చీల మధ్య వున్న టీపాయ్ మీద అందమైన షీట్ ఎట్లా ఉండాలని అనుకుంటామో, ఆ టీపాయ్‌పై ఉన్న పుస్తకాలమీదుంచే పేపర్ వెయిట్ కూడా అందంగా ఉంటే ఇంకా ఎంతో బావుంటుంది. ఏ వస్తువైనా, అందమైనా ఏ అలంకారమైనా కాలానుగుణ్యంగా ఉంటేనే ముచ్చటగా ఉంటుంది. అలాంటి కాలానుగుణ్యమైన ముచ్చటైన బాల్ పేపర్ వెయిట్ ఒకటి, చేయదలచుకున్నవాళ్ళ కోసం చెబుతున్నాను.

కాస్తంత ఓపిక వీలు ఉంటేచాలు, ఇది చేయటం చాలా తేలిక. కావాల్సిన సరంజామా కూడా మరీ తక్కువే. కావలసిన వస్తువులు: పిల్లలు ఆడుకునే రబ్బరు బంతి ఒకటి (మనకు కావలసిన సైజులో) గుండు సూదులు ఇంచుమించు **1500.** (ఒక్కొక్క కాగితానికి వంద చొప్పునుండే గుండు సూదుల కాగితాలు బజార్లో కొట్లలో పావలాకో, ముప్ఫై పైసలకో దొరుకుతాయి) చెమ్కీలు (ఏ రంగు కావాలనుకుంటారో ఆ రంగులో) ఒక తులం. ఇక్కడ ఇచ్చిన ఫొటోలోని పేపర్ వెయిట్‌కి రెండు రకాలైన రంగుల చెమ్కీలు వాడాను. రెండు రంగులు కావాలనుకునే వాళ్ళు రంగుకో తులం చొప్పున తీసుకోవాలి. హైదరాబాదులో అయితే రూపాయన్నరకు ఒక తులం చొప్పున ఇస్తున్నారు. ఈ చెమ్కీలు తులంకి తక్కువ యివ్వకపోవచ్చు. తులం తీస్తే బంతి కాగా మిగిలిపోతాయి. ఇరుగుపొరుగువాళ్ళు కలిసి చేసుకుంటే మంచి ఆదా! పొడవు పూసలు. (ఇంచుమించు సెంటిమీటర్ పొడవుంటాయి) వీటిని పూర్ణీలు అంటారు. బాల్‌కి పనికివచ్చే పూసలంటే కొట్టువాళ్ళు ఇస్తారు. ఇవి కూడా రెండు రంగుల్లో, రంగుకి రెండు తులాల చొప్పున తీసుకోవాలి. ఈ పూసలు కూడా రూపాయిన్నరకి తులం చొప్పున ఇస్తున్నారు బజార్లో.

చేసే విధానం:

ముందు రబ్బరు బంతి మీద పెన్సిలుతో మీకు కావలసిన ఏ డిజైనైనా వేసుకోండి. జంతువులు, పక్షులు, లతలు, పూవులు ఏవైనా బావుంటాయి. ఇక్కడ ఇచ్చిన ఫొటోలో కుందేలు బొమ్మని రెండు వైపులా వేశాను. భారతదేశం వేశాను. అలా ముందు మనం వేసుకున్న డిజైనుని ఒక రంగుతో నింపుకోవాలన్నమాట. గుండుసూదికి ముందు పూస ఎక్కించి తరువాత చెమ్కీని ఎక్కించాలి. వీటిని డిజైను బార్డరువెంట గుచ్చి బంతి ఏ మాత్రం కనిపించకుండా గుండుసూదులతో చెమ్కీలతో పూర్తిగా నింపేయాలి. గుండుసూదికి పూర్ణీనీ, చెమ్కీనీ ఎక్కించి బంతిలోకి సూది తలమీద చూపుడు వేలు ఉంచి గట్టిగా నొక్కాలి. పూస లేనంత మేరకే సూది బంతిలోకి దిగుతుంది. కుందేలు డిజైను పూర్తి అయాక మరో రంగు పూసలనీ చెమ్కీలనీ తీసుకుని మిగత బంతిని పైన చెప్పినలాగునే గుచ్చేయాలి.

మొత్తం పూర్తి అయాక యీ పేపర్ వెయిట్ మీది తళుకులు వెలుగుకి మిలమిలా మెరసిపోతోంటే - ఇది ఎలా చేశారో ఎవరైనా కనుక్కోగలరేమో చూడండి!

—జె. వసుధా విద్యాసాగర్

"గర్భ స్రావం చెయ్యడానికి ప్రయత్నించాలి. మందులతోనో, ఆపరేషన్ చేసో, ఆ గర్భం పోయేలా చెయ్యాలి. యిదిగో శాంతా, నీతో కబుర్లు చెప్తూ కూర్చోలేను. నాకు పనుంది. పేషెంట్స్ వెయిట్ చేస్తున్నారు. యింక వెళ్తావా లేదా?" ఫోన్ తీస్తూ బెదిరింపుగా శాంత వంక చూచింది సుమిత్ర.

"ఆ! ఆ! ఆగండి ఆంటీ! ఫోన్ పెట్టేయండి." చిలిపిగా చూస్తూ మందు చీటీనీ, వానిటీ బాగ్‌నీ తీసుకుని లేచింది శాంత. అంత వరకు బయట కూర్చున్న పేషెంట్‌ని పరీక్ష చేసి, మందులు వ్రాసిచ్చి, వసంత దగ్గరకు వెళ్ళింది సుమిత్ర.

"అమ్మా! ఎలా వుంది అమ్మాయికి? భయం లేదంటారా?" వసంత అమ్మ దీనంగా అడిగింది. వసంత అత్తగారు కూడా ప్రక్కనే వుంది. ఇద్దరి ముఖాల్లోనూ కత్తి వ్రేటుకు కూడా నెత్తురు చుక్క లేదు.

"ప్రాణం మీదకు వచ్చేదాక మీకెన్ని చెప్పినా చీమ కుట్టినట్లయినా వుండదు. యిలాగే బట్ట అయిపోతూంటే మనిషికి ప్రమాదమని, గర్భ సంచి తీసేస్తానని యిప్పటికి ఆరు నెలల నుంచ యినా చెప్తున్నాను. మగపిల్లాడు, మగపిల్లాడంటూ ఆ అమ్మాయి ప్రాణం పోవడానికయినా ఒప్పు కుంటున్నారు కాని ఆపరేషనుకు ఒప్పుకోవడం లేదు." వాళ్ళ ధోరణికి విసిగిపోయినట్లుగా వుంది డాక్టర్ స్వరం.

"ఏదో నమ్మా. పెద్దవాళ్ళం, ఒక మగ నలుసు పుడితే మా కదో తృప్తి. వంశోద్ధారకుడు ఒకడన్నా వుండాలని వుంటుంది కదమ్మా!! ఆదిశక్తులు, ఒకరి తర్వాతొకళ్ళు ముగ్గురు పుట్టుకొచ్చారు ఎవరు కావాలన్నారనో!" వసంత అత్తగారి మాటలు విని చిరాకు పుట్టుకొచ్చింది సుమిత్రకు.

"వంశోద్ధారకుడు!! లోకంలో జరుగుతూంది రోజూ చూస్తూ కూడా ఎందుకు మామ్మగారూ అలా భ్రమలు పెంచుకుంటారు? ఎప్పటికైనా 'అమ్మా, నాన్న' అని కాస్త ప్రేమగా చూచేది ఆడపిల్లలే. యీ వంశోద్ధారకులంతా రెక్కలొచ్చి ఎగిరిపోగానే అమ్మా లేదు బొమ్మా లేదంటారు. నెపం మాత్రం పెళ్ళాం మీదకు తోసేసి తాము మాత్రం బుద్ధి మంతులమయినట్లు పోజ్ కొడతారు. యింతకూ నేను చెప్పొచ్చేది ఏమిటంటే - యిప్పటి కయినా మనసు మార్చుకుని వసంతకు ఆపరేషన్ చేయించేయండి. నిష్కారణంగా ఆ అమ్మాయిని చేజేతులా చంపేయకండి." సుమిత్ర మాటలు విని యిద్దరి ముఖాలూ మాడిపోయాయి. చేదు తిన్నట్లుగా ముఖాలు త్రిప్పుకున్నారు. వాళ్ళ రియాక్షన్ గమనించకుండానే వసంత పల్స్ చూచి కొంచెం మెరుగ్గా వుండడంతో ఆఫీసు రూములోకి వచ్చింది సుమిత్ర.

*

రెండు బాటిల్స్ రక్తం ఎక్కించాక మృత్యు ముఖం నుండి బయట పడింది వసంత. కొంచెం ఓపిక వచ్చాక ముందేం చెయ్యాలన్న సమస్య భయంకరంగా నిలిచి, వసంతని ఊపిరి సలప నివ్వని ఆలోచనల్లోకి నెట్టేసింది.

అన్నదమ్ములులేని తనకు మగపిల్లలంటే ప్రాణం. ముగ్గురు ఆడపిల్లల్ని కని మగపిల్లాడి కోసం తపించిపోతున్న తనకు యీ అరుదైన జబ్బు 'ముత్యాల గర్భిణి' వచ్చింది. ఒక్కసారి కాదు, రెండు సార్లొచ్చింది. యిలా రెండోసారి రావడం మరీ అరుదని చెప్పింది డాక్టరు. యిలా రావడం ప్రమాదమని, గర్భ సంచికి కేన్సర్ వచ్చే ప్రమాదముందని, వెంటనే గర్భ సంచిని తీసేయించుకోకపోతే ప్రాణానికే ముప్పు రావచ్చని చెప్పింది డాక్టర్. మగపిల్లాడు కావాలనే కోరిక ఎంత బలంగా వున్నా, పుట్టని పిల్లాడి కోసం, పుట్టిన ఆడపిల్లల్ని అనాధల్ని చేస్తూ తను ప్రాణం మీదకు తెచ్చుకోవడం మూర్ఖత్వమనిపించి తను ఆపరేషన్ చేయించుకోవడానికి సిద్ధపడింది. కాని అటు పుట్టింటి వారు, యిటు అత్తింటి వారు కూడ తీవ్రంగా ప్రతిఘటించారు. ముగ్గురు పిల్లలు పుట్టాక కూడా ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకోలేదు సరికదా, తన ప్రాణాల్ని పణంగా పెట్టి మగపిల్లాడి కోసం ఎదురు చూస్తున్నాడు తన భర్త కూడ. అక్కడికీ ఒకటి రెండుసార్లు భయపడుతూనే తను డాక్టర్ చెప్పిన ఆపరేషన్ చేయించుకుంటా నంది. అందుకు అత్తగారు, మామగారు ఆపరేషన్ గనుక చేయించుకుంటే తను తన పిల్లల్తో పుట్టింటికి చేరి శాశ్వతంగా అక్కడే వుండిపోవాలన్నట్లు పరోక్షంగా సూచించారు. వాళ్ళ ధోరణికి తనకు కడుపు మండి పోయింది. వాళ్ళ మాటలు వింటూ కూడా శిలలా కూర్చున్న భర్తవంక చూచి యీ వ్యక్తేనా తనని కావాలని పట్టుబట్టి పెండ్లాడింది! యిన్నాళ్ళూ

## పుస్తకాలు

### శారద

[రచన: సి. ఆనందారామం; వెల: రు 7-50; పేజీలు 244 : ప్రచురణ: న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ-2.]

స్వార్థం తెలుసు, త్యాగం తెలుసు, ఏది ఆత్మ విశ్వాసమో, ఏది అహంకారమో తెలుసు. కాని ఆమెకు త్వరగా ఉద్రేకం వస్తుంది. ఆ కోపంలో మంచీ చెడూ విచక్షణ తెలియదు. ఆ బలహీనత ఆమెకు తెలుసు. ఎప్పటికప్పుడు పశ్చాత్తాప పడ్తుంటుంది.

శారద రచయిత్రి. ఆమె భర్త-రావు మంచి విమర్శకుడు. అతని విమర్శలతో, ప్రోత్సాహంతో ప్రసిద్ధ రచయిత్రిగా ఎదుగుతుంది. కాని అహంకారంతో రావుకు దూరమై అతని కోసం అలమటిస్తుంది. రచయిత్రిగా ఎంత పేరు వచ్చినా ఆ రచనలు ఆమెకు తృప్తి కల్గించవు. అవి వుండవల్సిన స్థాయిలో లేవని గ్రహించి చివరికి దానికి కారణం తెలుసుకుంటుంది. రావు, పాప ఇద్దరూ దూరం కావటం శారద భరించలేక పోతుంది. ఆర్తితో రావుని, ప్రేమతో పాపని దగ్గరికి చేర్చుకుంటుంది. జీవితేచ్ఛ నశించి, ఉత్సాహం లేక పోవటంతో ఆమెకు ఏకాగ్రత కుదరలేదని రావు చెప్తాడు.

'నానృషిః కురుతే కావ్యం' అనే ఆర్యోక్తికి అర్థంగా....నిరంతరాన్వేషణ, నవనవోన్మేష ఉత్సాహశక్తి, మమత నిండిన మనసు, నిర్మోహ మాటమైన దృష్టి, ఏకాగ్రతగల సాధన-ఇవి లేక రససృష్టి సాధ్యం కాదని చెబ్తూ నవల ముగుస్తుంది. ఒక మంచి నవల చదివామన్న తృప్తిని పాఠకులకు మిగులుస్తుంది.

## వార్తలు

ముప్పైఐదవ స్వాతంత్ర్య దిన సందర్భంగా విశాఖలోని కొన్ని మహిళా సంఘాల విశేషాలు: బురుజుపేట ఎ. ఎస్. ఆర్. మహిళా భవనంలో శ్రీమతి పద్మావతీ నరసింహారావు పతాకావిష్కరణ గావించారు. "వనితా రోటరాక్టు" ఈ మహిళా భవనంలో నిర్వహింపబడుతూన్న 'బాపూజీ బాల విహార్' బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను, మిఠాయిలను అందజేశారు. శ్రీమతి దువ్వూరి లలితారామమూర్తి అధ్యక్షతన సాయంత్రం జరిగిన సమావేశంలో – కేవలం అనాథలు, నిస్సహాయులైన యువతుల ఉపాధికల్పన నిమిత్తం ఉద్దేశించబడిన – క్రొవ్వొవత్తులు, సుద్ద ముక్కలు తయారుచేసే కుటీర పరిశ్రమకు ఉపాధ్యక్షురాలు శ్రీమతి పి. శకుంతలమ్మ ప్రారంభోత్సవం చేశారు. ఈ మహిళా భవనం ఆధ్వర్యంలో శ్రీమతి గున్నేశ్వరి నిర్వహించే (భౌతికాధిగమన) ధ్యానాభ్యాన తరగతులకు కూడా ప్రారంభోత్సవం జరిగింది. శ్రీమతి గున్నేశ్వరి యీ తరగతుల ప్రాముఖ్యాన్ని విశదీకరిస్తూ, యివి శాస్త్రీయ దృక్పరిధిలో విశ్లేషించబడిన అలౌకిక ధ్యానాభ్యాన తరగతులని, యీ అభ్యాసం ద్వారా మానసిక చికిత్స జరిగి - రక్తపుపోటు, నరాల బలహీనత, అతి నిద్రవల్ల కలిగే అనేక వ్యాధులు రాకుండా చేసుకోవచ్చునని, యిది అన్ని వయస్సుల లోని స్త్రీ పురుషులూ అభ్యాసం చేసుకోవచ్చునని చెప్పారు. సభకు ముఖ్య అతిథిగా వ్యవహరించిన కుమారి పి. జగన్మోహిని ఉపాధిలేని మహిళలకు యీ కుటీర పరిశ్రమల నిర్వహణ చాలా అవసరమని, అయితే వాటికి సరియైన అమ్మకపు వసరులను కూడా సమకూర్చుకోవాలని అన్నారు.

ద్వారకానగర్‌లోని బా–బాపూ (మహిళా) భవనంలో ప్రసిద్ధ సంఘ సేవకురాలు, గుత్తి మహిళా సమాజానికి మాజీ అధ్యక్షురాలైన శ్రీమతి సరోజినీ గోపాలరావు పతాకావిష్కరణ గావించారు. డా॥ ఇందిరాబాయి పతాక ప్రాధాన్యం గూర్చి, గాంధీజీ ఆదర్శాలైన సత్యం, అహింసల ఆచరణావశ్యకతను గూర్చి వివరించి చెప్పారు. "బాల్‌వాడీ" పిల్లలు ముప్ఫయిమందికి సంఘ మహిళలు స్వచ్ఛందంగా కుట్టిన కొత్త బట్టలను శ్రీమతి సరోజిని పంచిపెట్టారు. ఈ దుస్తులకు కావలసిన గుడ్డను శ్రీమతి లలితారెడ్డి ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభకు డా॥ శ్రీమతి ఇందిరాబాయి అధ్యక్షత వహించగా సంఘ కార్యదర్శి, కుమారి పి. జగన్మోహిని స్వాగతం పలికారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రసిద్ధ కవయిత్రి శ్రీమతి నాయని కృష్ణకుమారి మహిళా సంఘాలు స్త్రీజనానికి, బాలబాలికలకు చేస్తున్న అమూల్యమైన సేవలను ప్రశంసిస్తూ, నేటి ప్రచార సాధనాలయినటువంటి సినిమాలు, నవలలు మహిళా సమాజాలను, కార్యకర్తలను (అలాగే కాలేజీ విద్యార్థులను) విపరీతంగా వక్రీకరించి హేళన చేస్తున్నాయనీ, వ్యంగ్యంగా విమర్శలు చేస్తున్నాయనీ, వీటివలన యీ సంస్థలకు మేలు కలుగకపోగా దుష్ప్రచారం ఎక్కువవుతున్నదనీ, యిది చాలా శోచనీయమనీ, గర్హనీయమనీ అన్నారు. సంఘసేవలోను, మహిళా జనోద్ధరణలోను గణనీయమైన సేవచేసిన శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, సాంఘిక సేవలకు పురుషులకన్నా స్త్రీలకే ఎక్కువ సావకాశాలున్నందువల్ల స్త్రీలు ముందంజ వేయాలని అన్నారు. కుమారి జగన్మోహిని సభను ముగింపుజేస్తూ బా–బాపూ మహిళా సమాజం నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలను విశదీకరించారు. డా॥ ఇందిరాబాయి శ్రీమతి నాయని కృష్ణకుమారిని, శ్రీమతి సరోజిని గోపాలరావును, శ్రీమతి మహదేవన్‌లకు గాంధీజీ చిహ్నంగల కాంస్య పతకాలు ధరింపజేశారు.

—విలేకరి

ఈయన చూపించిన ప్రేమ, మమత అంతా నటనేనా అన్న అనుమానమొచ్చింది. వాళ్ళ కఠినత్వాన్ని ఎదిరించి, తెగించి ఆపరేషన్ చేయించుకోలేని తన అశక్తతకు తనమీద తనకే కోపమొచ్చింది. వాళ్ళనెదిరించి ఆపరేషన్ చేయించుకోగల ఆర్థిక స్వాతంత్ర్యం తనకు లేనందుకు ఉక్రోషమొచ్చి అది కన్నీళ్ళ రూపంలో కరిగివచ్చింది. కాని తన కన్నీళ్ళకు కాలం ఆగలేదు. తన ఒంట్లో రక్తం కాలవలై ప్రవహించడం మానలేదు. తన ఊపిరి గాలిలో కలిసిపోయి, తను మట్టిలో కలిసిపోయే స్థితిని నూలువాసిలో తప్పించుకుంది. కాని యిది ప్రస్తుతానికి–రేపు తనెలావుంటుందో తెలియదు. యిలాగే కొన ఊపిరితో వుంటుందో, మళ్ళీ రక్తస్రావమధికమయి మృత్యువుతో హోరాహోరీ యుద్ధం చెయ్యవలసి వుంటుందో తెలియదు. తను లేనినాడు లేడి కూనల్లాంటి తన కూతుళ్ళు సవతితల్లి చేతుల్లో నానా కష్టాలుపడుతూ....వాళ్ళనాన్న,వాళ్ళమీద ప్రేమను చంపుకోలేక, ముద్దుల భార్యను ఎదిరించలేక పిరికిగా చూడడం....భవిష్యత్తుని గురించి చాలా వికృతమైన ఊహాలొస్తున్నాయి వసంతకు.

"వసూ!" ప్రేమగా తన తల నిమురుతున్న భర్తవంక భావరహితంగా చూచింది వసంత.

"రేపు బుధవారంనాడు ఆపరేషన్ చేస్తానంటున్నారు డాక్టరమ్మగారు." వసంత బెడ్ అంచుమీద కూర్చుని ఆమె చేతిని మృదువుగా తన చేతుల్లోకి తీసుకున్నాడు భాస్కర్రావు.

"మరి బాబు...." సందిగ్ధంగా, నమ్మలేనట్లుగా చూచింది వసంత.

"ఇంతకాలం నా ప్రవర్తనకి చచ్చే సిగ్గుగా వుంది. డాక్టరమ్మగారు చెప్తున్నా యింత ప్రమాదమని నమ్మక నిర్లక్ష్యం చేసాను. బాబు కోసం–నీ ప్రాణాలు పోతున్నా చూస్తూ ఊరుకునే ధైర్యం లేదిక. నన్ను నమ్ము వసూ! నీకంటే నాకేదీ ముఖ్యం కాదు." తన చేతిని పదిలంగా పట్టుకుని అతి ఆప్యాయంగా నిమురుతున్న భర్త వంక చూస్తున్న వసంత కళ్ళల్లో చివ్వున నీళ్లు ఉబికాయి.

"అత్తగార్ధు, మామగారు ఏమంటారోనండీ!" అంతలోనే భయం చుట్టేసింది వసంతని.

"పెద్దవాళ్ళ మాటలను తప్పకుండా గౌరవించాల్సిందే. కాని వాళ్ళ పెద్దరికం మనముందు కంచుగోడలా నిలబడి, అది మనమీదే విరుచుకు పడబోతూంటే ప్రక్కకు తప్పుకోక తప్పదు. ఐనా, యిది మనిద్దరికీ సంబంధించిన సమస్య. యిందులో మరొకళ్ళు....వాళ్ళు మా అమ్మ నాన్నగాని, మీ అమ్మ, నాన్నగాని తలదూర్చ డానికి హక్కు లేదు."

భర్తవంక 'సెభాష్' అన్నట్లుగా చూసింది వసంత.

"వాళ్ళకోసం, వీళ్ళకోసం నిన్ను పోగొట్టుకోలేను వసూ! డాక్టర్‌గారి సలహా ప్రకారం అంతా జరుగుతుంది." దృఢంగా వున్న భర్త కంఠస్వరం విని, పట్టుబట్టి తననే పెళ్ళాడుతానని తల్లిదండ్రులతో పోట్లాడిన అతని రూపం గుర్తొచ్చి పొంగిపోయింది వసంత. తన చిట్టి తల్లులు 'సరిత', 'సహిత', 'మమత' గుర్తొచ్చి వారి అందమైన భవిష్యత్తు గురించి అందమైన కలలు కంటూ కమ్మగా పడుకుంది వసంత. □